సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 14 । అక్టోబర్ । 2024



పర్వతవర్ధినికి బంగారు సూత్రాలు


గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన తుమ్మల రామకృష్ణ (చిన్నబ్బు) దంపతులు రూ.60 వేల విలువైన 8 గ్రాముల బంగారు సూత్రాలను ఆదివారం అందజేశారు.



వెంకన్నకు రూ.50 వేల విరాళం

జగ్గంపేట: మండలంలోని రాజపూడి గ్రామంలో సత్యనారాయణస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలకు రుచి డాబా అధినేత పాలచర్ల నాగేంద్ర చౌదరి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు.

80 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం సాయంత్రం 80,215 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 12,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు.

లాటరీకి వేళాయె..



మద్యం దుకాణం

- నేడు కలెక్టరేట్‌లో అధికారుల సమక్షంలో డ్రా
- 4,887 దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు

సాక్షి, అమలాపురం: జిల్లాలో పట్టణాలు, మండలాల వారీగా మద్యం దుకాణాలను విడదీయకుండా ఏకండీగా నిర్వహిస్తున్న లాటరీ విధానం వల్ల దుకాణాలు పొందేవారంతా సిండికేటుగా మారాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు. జిల్లాలో మద్యం దుకాణాలకు సంబంధించి సోమవారం లాటరీ తీస్తున్న నేపథ్యంలో టీడీపీ అనుకూల మద్యం వ్యాపారులు, దుకాణాలు పొందిన వారు సిండికేటు అయ్యేందుకు సిద్ధమవుతున్నారు.

గతంలో మద్యం దుకాణాల వారీగా దరఖాస్తులు పిలిచేవారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించేవారు. అలాగే మండలాల్లో మండల కేంద్రంతో పాటు మేజర్ పంచాయతీ, అమ్మకాలు అధికంగా ఉండే తీరంలోని మత్స్యకార గ్రామాల్లో దుకాణాలకు పలానా ప్రాంతం, గ్రామాల వారీగా టెండర్లు వేసేవారు. కానీ ఈసారి మాత్రం ప్రభుత్వం పట్టణానికి ఇన్ని, మండలానికి ఇన్ని దుకాణాలకు అంటూ దరఖాస్తులు ఆహ్వానించింది. అంతే తప్ప పలానా ప్రాంతం, గ్రామం అని పేర్కొనలేదు. పట్టణాలు, మండలాల వారీగా నాలుగు నుంచి ఏడు దుకాణాల వరకు ఉంటాయని, వాటికి దరఖాస్తు చేసుకోవాలని తేల్చింది. ఇప్పుడు లాటరీలో దుకాణం పొందేవారు ఎక్కడైనా దుకాణాలు పెట్టుకోవచ్చు. దీని వల్ల పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలు, అధికంగా అమ్మకాలు ఉండే తీరంలోని మత్స్యకార గ్రామాల్లో ఇష్టానుసారం దుకాణాలు పెట్టుకునే అవకాశముంది. గతంలో షాపుల వారీగా సరిహద్దులు నిర్ణయించుకుని పట్టణాల్లోని వార్డులు, గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు. కానీ ఇప్పుడు విధానంలో ఆ పరిస్థితి లేనందున అమ్మకాల విషయంలో లేనిపోని వివాదాలకు, ఘర్షణలకు దారి తీయనుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా పట్టణాలు, మండలాల వారీగా మద్యం వ్యాపారులు తప్పనిసరిగా సిండికేటుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడే దుకాణాల ఏర్పాటు అవసరమైన చోట పెట్టుకోవడం, వాటి పరిధిలో బెల్టుషాపులు ఏర్పాటు చేసుకోవడం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం కోరుకుంటుంది కూడా ఇదే. మద్యం దుకాణదారులు సిండికేటుగా మారితే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతోంది. మద్యం వ్యాపారంపై టీడీపీ అనుకూల సిండికేటుదారులు పట్టు పెరుగుతోంది. ఆ ఆలోచనతోనే ప్రభుత్వం పట్టణ, మండలాల్లో మద్యం దుకాణాలకు ప్రాంతాలు ఎంపిక చేయకుండా దరఖాస్తులు ఆహ్వానించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కీలక సిండికేటుదారులు సైతం లాటరీల నిర్వహించే ప్రాంతంలో దుకాణాలను దక్కించుకునే వారిని సిండికేటు చేయాలని నిర్ణయానికి వచ్చారు. సిండికేటు అయిన తరువాత మండలం, మున్సిపాలిటీలు యూనిట్‌గా దుకాణాలు ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై ఒక నిర్ణయానికి రానున్నారు. తరువాత బెల్ట్ దుకాణాలు ఏర్పాటు, ఇతర విషయాలపై స్పష్టత రానుంది.

జిల్లాలో మున్సిపాలిటీ, మండలాల వారీగా మద్యం దుకాణాలు, దాఖలైన దరఖాస్తుల వివరాలు

అర్బన్/ మండలం	షాపుల సంఖ్య	వచ్చిన దరఖాస్తులు	సగటు
అమలాపురం	9	395	43.89
అల్లవరం	6	166	27.67
ఉప్పలగుప్తం	4	145	36.24
అంబాజీపేట	5	206	41.20
అయినవిల్లి	4	118	29.50
మామిడికుదురు	5	192	38.40
పి.గన్నవరం	5	251	50.20
ఐ.పోలవరం	3	113	36.67
ముమ్మిడివరం	4	155	38.75
కాట్రేనికోన	6	170	28.33
రావులపాలెం	8	280	35
కొత్తపేట	8	173	21.63
ఆత్రేయపురం	4	136	34
ఆలమూరు	5	139	27.80
మండపేట	11	205	18.64
కపిలేశ్వరపురం	4	83	20.75
రాయవరం	4	117	29.25
రాజోలు	8	265	33.13
సఖినేటిపల్లి	7	174	24.86
మలికిపురం	9	282	31.33
రామచంద్రపురం	10	192	19.20
కె.గంగవరం	4	132	33





మద్యంషాపుల లాటరీకి సిద్ధమైన కలెక్టరేట్‌లోని గోదావరిభవన్

4887 దరఖాస్తుల స్వీకరణ

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న 133 మద్యం షాపులకు సోమవారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్ గోదావరిభవన్‌లో అభ్యర్థుల సమక్షంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ లాటరీ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన మద్యం పాలసీకి సంబంధించి జిల్లాలో ఉన్న 133 షాపులకు గాను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 4,887 దరఖాస్తులను స్వీకరించారన్నారు. నూతన మద్యం పాలసీ అమలుకు సంబంధించి ప్రతి ప్రక్రియను అత్యంత పారదర్శకంగా ఎటువంటి అపోహలకు తావు లేకుండా జవాబుదారీతనంతో నిర్వహిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ లాటరీ ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీతో జరుగు తుందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

రేపు అమ్మకాలు ప్రారంభం

జిల్లాలో మొత్తం 133 మద్యం దుకాణాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించింది. తొలుత మందకొడిగా సాగిన టెండర్ల ప్రక్రియ చివరి నాలుగు రోజులు జోరుగా సాగిన విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,500ల దరఖాస్తులు లక్ష్యంగా తొలుత నిర్ణయించగా, తరువాత దీనిని 5000కు పెంచారు. గడువు ముగిసే సమయానికి జిల్లా వ్యాప్తంగా 4,887 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తులకు కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో లాటరీ నిర్వహించి కేటాయింపులు చేయనున్నారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం షాపులు ఖరారు చేయడంతో మంగళవారం కొత్త పాలసీ ప్రకారం మద్యం అమ్మకాలు ప్రారంభిస్తారని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు చెప్పారు. అయితే అమ్మకాలు ప్రారంభించే సమయంపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు.

న్యూస్‌రీల్

అయినవిల్లిలో భక్తుల సందడి



విశేషాలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం వివిధ ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి మహానివేదన అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 131 మంది, లక్ష్మీగణపతి హోమంలో 28 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. 39 మంది చిన్నారులకు తులాభారం, నామకరణ, అక్షరాభ్యాసం, అన్నప్రాశన వంటి విశేష పూజలు చేశారు. ఐదుగురు స్వామికి తలనీలాలు సమర్పించారు. 123 మంది తమ నూతన వాహన పూజలు నిర్వహించారు. 2286 మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.2,91,351 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

అర కిలో వెండి సమర్పణ



సుబ్బాలమ్మకు అర కిలో వెండిని అందిస్తున్న న్యాయవాది కుటుంబీకులు

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ అమ్మవారికి వెండి చీర తయారు చేయిస్తున్నారు. ఈ క్రమంలో తమ వంతుగా పట్టణానికి చెందిన న్యాయవాది అడపా సత్యప్రసాద్ కుటుంబం అరకిలో వెండిని సమర్పించింది. అరకిలో వెండిని సుబ్బాలమ్మ ఆలయంలో ఆలయ మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్యనాయుడు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యర్రంశెట్టి మూర్తి, అరిగెల బాబ్జి తదితరులకు న్యాయవాది సత్యప్రసాద్ కుటుంబం శనివారం అందించింది.

దుర్గాదేవికి శతమానాలు..



దుర్గాదేవికి శతమానాలను సమర్పిస్తున్న సత్తిబాబు దంపతులు

తాళ్లరేవు: మండలంలోని కోరంగిలో వేంచేసిన దుర్గామల్లేశ్వర ఆలయంలో అమ్మవారికి పటవల గ్రామానికి చెందిన భజన సత్తిబాబు, శ్రీలక్ష్మి దంపతులు సుమారు రూ.70 వేల విలువ చేసే శతమానాలను సమర్పించారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతుల చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, భజన చినసత్తిబాబు, దేవి, పృథ్వీ, లక్ష్మణరావు, గంగసూర్యనారాయణ, ధూళిపూడి బాబి పాల్గొన్నారు.

సరస్వతీదేవికి వెండి వీణ..



వెండి వీణను సమర్పించిన దాతలు

అంబాజీపేట: గ్రామ శివారు కొత్తపాలెంలోని హంసవాహనం సరస్వతీ దేవికి గ్రామానికి చెందిన రాయుడు వెంకటరమణ, విజయ మంగా లక్ష్మీ దంపతులు ఆదివారం వెండి వీణను సమర్పించారు. సుమారు రూ.1.25 లక్షలు విలువ చేసే వెండి వీణను రమణ దంపతులు కమిటీ సభ్యులకు అందజేశారు. అంతకుముందు వెండి వీణకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీకి మాజీ ఎమ్మెల్యే రాపాక రాజీనామా

మలికిపురం: రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు వైఎస్సార్ సీపీకి రాజీనామా చేసినట్లు ఆదివారం తెలిపారు. మలికిపురంలో ఆయన మాట్లాడుతూ ఏ పార్టీలో చేరేది త్వరలోనే ప్రకటిస్తానని అన్నారు.

దేవీ నిమజ్జనాల్లో అపశ్రుతి..

గోదావరిలో ఇద్దరి గల్లంతు



నరాల వేదమూర్తి



మేడిశెట్టి వీరబ్రహ్మం

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలోని గౌతమి గోదావరి నది వద్ద జరుగుతున్న దేవీ నిమజ్జనాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. దేవి నిమజ్జనం అనంతరం స్నానం చేయడానికి గోదావరిలో దిగిన ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రపురం రూరల్ మండలంలోని రావిచెరువు గ్రామానికి చెందిన నరాల వేదమూర్తి (28), మేడిశెట్టి వీరబ్రహ్మం (40) దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా గ్రామస్తులతో పాటు అమ్మవారిని నిమజ్జనం చేసేందుకు ఆదివారం మధ్యాహ్నం కోటిపల్లి పుష్కరఘాట్ వద్దకు వచ్చారు. దేవీ నిమజ్జనం అనంతరం రేవులో స్నానం చేయాలని వారు భావించారు. అయితే ఇటీవల గోదావరి వరద ఉధృతి కారణంగా రేవులోని పుష్కర ఘాట్ వద్ద కొంత మేర ఇసుక మేట వేసింది. దీంతో లోతు తక్కువగా ఉండడంతో కొంత దూరం నడిచి వెళ్లి భక్తులు స్నానాలు చేస్తున్నారు. వీరు కూడా స్నానానికి దిగి కొంత దూరం ఈత కొట్టి ఒడ్డున ఉన్న పంటు వద్దకు చేరుకున్నారు. పంటు వద్ద లోతు ఎక్కువగా ఉండడం తెలియని వేదమూర్తి, వీరబ్రహ్మం గోదావరి ఉధృతికి గల్లంతయ్యారు. కూతవేటు దూరంలో స్నానం చేస్తున్న భక్తులు వీరిని గమనించి కాపాడడానికి ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది రేవు వద్దకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. కాగా వేదమూర్తి ప్రభుత్వ మద్యం షాపులో సేల్స్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరబ్రహ్మం స్థానికంగానే వ్యవసాయ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరిద్దరు గోదావరిలో గల్లంతైన విషయం తెలియడంతో రావిచెరువు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంబరాన్నంటిన దసరా సంబరాలు



అమలాపురం దసరా సంబరాల్లో శక్తి వేషాల ప్రదర్శన

అమలాపురం టౌన్: పట్టణంలో ఏడు వీధుల ఊరేగింపుల సమ్మేళనంతో శనివారం జరిగిన దసరా ఉత్సవాలు, సంబరాలు అంబరాన్నంటాయి. కొంకాపల్లి, మహిపాలవీధి, గండు వీధి, నల్లా వీధి, రవణం మల్లయ్యవీధి, రవణం వీధి, శ్రీరామపురం వీధులకు చెందిన దేవతా మూర్తుల వాహనాలతో, చెడీ తాలింఖానా ఆయుధాల విన్యాసాల ప్రదర్శనలతో శనివారం సాయంత్రం నుంచి ఆయా వీధుల నుంచి ఊరేగింపులు ప్రారంభమయ్యాయి. ఈ ఊరేగింపులు ఆదివారం ఉదయం వరకూ నిర్విరామంగా పుర వీధుల్లో సాగాయి. చెడీ తాలింఖానా వీర విద్య ప్రదర్శనలు చూసేందుకు హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఈ ప్రాంత వాసులు అమలాపురానికి తరలివచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కూడా ఈ ఊరేగింపులను వీక్షించేందుకు తరలివచ్చారు. చెడీ తాలింఖానా వీర విద్య ప్రదర్శకుల చేతుల్లో కత్తులు దూసుకున్నాయి. కర్రలతో కలబడతూ చెడీ చేశారు. అగ్గి బరాటాలతో విన్యాసాలు చేశారు. లేడి కొమ్ములతో తలబడ్డారు. వీర విద్య ప్రదర్శనలతో పాటు పలు రకాల సాంస్కృతిక ప్రదర్శనలు కూడా వీక్షకులను అలరించాయి. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్, మాజీ డిప్యూటీ సీఎం, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అమలాపురం, పి.గన్నవరం ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణలు ఈ ఏడు వీధుల దసరా ఊరేగింపులను వీక్షించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పర్యవేక్షణలో జిల్లా ఏఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, అదనపు బలగాలతో మొత్తం 600 మందితో ఊరేగింపుల వద్ద బందోబస్తు నిర్వహించారు.

భీమేశ్వరాలయంలో శమీ పూజ

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ధూప, దీప సేవ అనంతరం జమ్మిచెట్టు వద్ద శమీ పూజ నిర్వహించారు. ఈ పూజను ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పం, ప్రసాద వితరణ చేశారు. శమీ పూజ అనంతరం స్వామివార్లను వేగాయమ్మపేట దివాణానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీరగాథలు తెలుసుకుందాం.. పోటీల్లో నిలుద్దాం

- విద్యార్థులకు వీర్‌గాథ 4.0 పోటీలు
- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాలుగు కేటగిరీల్లో పోటీలు
- నేడు, రేపు ప్రత్యేకంగా పాఠశాల స్థాయి రిజిస్ట్రేషన్లకు ఆదేశాలు

రాయవరం: విద్యార్థి స్థాయి నుంచే దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం వీరగాథ 4.0 పోటీలను నిర్వహిస్తోంది. గత మూడేళ్లగా ఏటా నిర్వహిస్తున్న పోటీలు ఈ ఏడాది కూడా వీరగాథ 4.0 పోటీలు నిర్వహించడానికి చర్యలు చేపట్టింది. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల గాథలు తెలియజేయడానికి, విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు దేశ విద్యా మంత్రిత్వ, రక్షణ శాఖలు సంయుక్తంగా వీరగాథ 4.0 పోటీలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు.

3వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు..

జిల్లా వ్యాప్తంగా మూడో తరగతి నుంచి 12వ తరగతి (ఇంటర్) వరకు విద్యార్థులకు నాలుగు అంశాల్లో ఈ పోటీలు చేపడుతున్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా, దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన వీరుల గాథలను వివరించడం, వీరుల త్యాగాలను తెలిపే విధంగా విద్యార్థులకు పద్యాలు, కథలు, చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీమీడియా ప్రదర్శన వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 14, 15 తేదీల్లో పోటీలు నిర్వహించి, ఆ వివరాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మై జీవోవీ.ఇన్ వెబ్ పేజీలో వీర్ గాథ ఆప్షన్ క్లిక్ చేసి వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. సబ్మిట్ యువర్ ఎంట్రీ అని ఉన్న చోట క్లిక్ చేసి వివరాలను నమోదు చేయాలి. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల నుంచి అత్యుత్తమమైన నాలుగు ఎంట్రీలను అప్‌లోడ్ చేయాలి. ఇప్పటికే ఈ పోటీలకు సంబంధించి విద్యాశాఖ, సమగ్ర శిక్షా జిల్లా ఉన్నతాధికారులు పాఠశాలలకు ఉత్తర్వులు పంపిణీ చేయడంతో పాటుగా, ఆన్‌లైన్ సమావేశాలను నిర్వహించారు. అక్టోబరు 17 నుంచి నవంబరు 10వ తేదీ వరకు జిల్లా స్థాయి, నవంబరు 12 నుంచి 30వ తేదీ మధ్య రాష్ట్ర స్థాయి, డిసెంబర్ 4 నుంచి 24వ తేదీ మధ్య జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారు.

నాలుగు విభాగాల్లో పోటీలు

పాఠశాలల వారీగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. 3–5 తరగతులకు ఒక విభాగంగా, 6–8 తరగతుల విద్యార్థులకు ఒక కేటగిరి, 9–10 తరగతులకు ఒక కేటగిరి, 11–12 తరగతులకు ఒక కేటగిరిగా విభజించారు. । 3–5 తరగతుల విద్యార్థులకు పద్యం, కథ (150 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్. ।6–8 తరగతుల విద్యార్థులకు పద్యాలు/కథ (300 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన. ।9–10 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం (700 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన. । 11–12 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం (1,000 పదాలతో), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన ఉంటుంది. ఒకటి లేదా రెండు నిమిషాల నిడివితో దేశభక్తికి సంబంధించిన ప్రదర్శన వీడియో రూపంలో ఇవ్వడమే మల్టీమీడియాగా పరిగణిస్తారు.



వీర్‌గాథ లోగో

ఎంచుకోవాల్సిన అంశాలు

వీరగాథ 4.0 పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వారికి నచ్చిన అంశాలను ఎంచుకునే అవకాశాన్ని కల్పించారు. దేశం కోసం అత్యున్నత త్యాగం చేసిన వారిని రోల్‌మోడల్‌గా ఎంచుకుని, వారి నుంచి నేర్చుకున్న విలువలను ప్రస్తావించాలి. ఆ విద్యార్థికి అవకాశం వస్తే ఏమి చేయదలచుకున్నాడో చెప్పాలి. అలాగే ఉదాహరణకు ఝాన్సీలక్ష్మీబాయి కలలోకి వచ్చి దేశానికి సేవ చేయాలని కోరితే ఏం చేస్తారో వివరించవచ్చు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటును తాను ఆదర్శంగా తీసుకున్న స్వాతంత్య్ర సమరయోధుల జీవిత కథలు విద్యార్థిపై ఎలా ప్రభావితం చేసిందో చెప్పాల్సి ఉంటుంది. అలాగే స్వాతంత్య్ర పోరాటంలో గిరిజనుల తిరుగుబాటు పాత్ర, ఇతర అంశాలను ఎంపిక చేసుకుని వివరించవచ్చు.

సూపర్ 100 విజేతలు

వీర్‌గాథ పోటీల్లో పాఠశాల స్థాయిలో ఎంపికైన వారిని జిల్లా, జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారు. ఒక కేటగిరీలో ఎంపికైన వారిని, మరో కేటగిరీకి ఎంపిక చేయకుండా వేర్వేరు విద్యార్థులను ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి పోటీల్లో నలుగురిని విజేతలుగా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎనిమిది మందిని విజేతలుగా గుర్తిస్తారు. జాతీయ స్థాయి పోటీల్లో 100 మందిని విజేతలుగా ప్రకటిస్తారు. వీరిని సూపర్–100 విజేతలుగా పిలుస్తారు. 3–5 వరకు 25 మంది, 6–8 తరగతుల వరకు 25 మంది, 9–10 తరగతి నుంచి 25, ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ నుంచి 25 మందిని ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలో విజేతలకు సత్కారం, ధ్రువపత్రం అందిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు విద్యా మంత్రిత్వ, రక్షణ మంత్రిత్వ శాఖల వారు రూ.10 వేల వంతున నగదు అందజేస్తోంది.

ఇప్పటికే ప్రతిభ కనబరుస్తూ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉన్న 2,030 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 2.04 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో తరగతుల వారీగా, కేటగిరీల వారీగా ఉపాధ్యాయులు పోటీలు నిర్వహిస్తున్నారు. పలువురు విద్యార్థులు సొంతంగా దేశభక్తిని పెంపొందించే విధంగా చిన్న చిన్న వీడియోలు రూపొందిస్తున్నారు.

చక్కని అవకాశం



విద్యార్థుల్లో దేశభక్తిని చాటేందుకు, అదే సమయంలో వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇదో చక్కని అవకాశం. వీర్‌గాథ 4.0 పోటీలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు పోటీల నిర్వహణను పర్యవేక్షణ చేయాలి. విద్యార్థులకు నిర్వహించిన పోటీలు, మల్టీమీడియా వీడియోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

– ఎ.మధుసూదనరావు, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

పోటీతత్వాన్ని పెంపొందించాలి



వీర్‌గాథ 4.0 కార్యక్రమంలో భాగంగా నిర్వహించే పోటీల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించాలి. జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభను చాటుకునేందుకు ఈ పోటీలు వేదికగా నిలుస్తాయి. విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చే విధంగా ఉపాధ్యాయులు మార్గ దర్శకత్వం చేయాలి. విద్యార్థుల్లో దేశభక్తిని చాటేలా..వీరుల గాథలు వారిలో స్ఫూర్తి నింపేలా పోటీలు నిర్వహించాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్లుప్తంగా

బాణసంచా సామగ్రి స్వాధీనం



ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్న అక్రమ బాణసంచా

ధవళేశ్వరం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజవోలు శివారులో పాడుబడ్డ పెంకుటిల్లులో ఉంచిన అక్రమ బాణసంచా సామగ్రిని ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా.. బొమ్మూరు గ్రామానికి చెందిన గుత్తుల శ్రీనివాస్ రాజవోలు శివారులో పాడుబడ్డ పెంకుటిల్లులో బాణసంచా సామగ్రి నిల్వ ఉంచారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం సీఐ టి.గణేష్ ఆదివారం దాడి చేసి అక్రమ బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బాణసంచా విలువ సుమారు రూ.85 వేలు ఉంటుందని అంచనా వేశారు. 24 లాట్‌ల చిచ్చుబుడ్లు, 8 లాట్‌ల తాటాకు టపాకాయలు, 4లాట్‌ల జువ్వలను స్వాధీనం చేసుకున్నారు.

గల్లంతైన మృతదేహం గుర్తింపు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం సముద్రతీరంలో గల్లంతైన బీహార్ వాసి మృతదేహం లభ్యమైంది. పెరుమాళ్లపురం సమీపంలో లైఫస్ కంపెనీలో ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బిహార్‌కు చెందిన వినయ్‌కుమార్ గుప్తా (21) ఈనెల 11న సముద్రతీరంలో స్నానానికి తోటి ఉద్యోగులతో వెళ్లి గల్లంతైన సంగతి విదితమే. కాగా శనివారం సాయంత్రం పెరుమాళ్లపురం తీరానికి మృతదేహం కొట్టుకురావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించగా వినయ్‌కుమార్ గుప్తాగా గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

సామర్లకోట: స్థానిక రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో సామర్లకోట మండలం జి.మేడపాడు–గూడపర్తి రైల్వే స్టేషన్ల మధ్యలో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం సాయంత్రం రైల్వే పోలీసులు కనుగొన్నారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం వైపు రైలు పట్టాలపై సుమారు (55) కలిగిన పురుషుని మృతదేహం ఉందని తెలిపారు. మృతదేహం రెండు ముక్కలుగా పడి ఉందన్నారు. మృతుని శరీరంపై తెలుపుపై ఎర్ర గీతలు కలిగిన షర్టు, నీలం, తెలుపు, నలుపు చెక్స్ ఉన్న షార్ట్ ఉందని తెలిపారు. కుడి కాలుకు ఎరుపు, తెలుపు మిశ్రితమైన తాడు ఉందన్నారు. మృతదేహాన్ని పెద్దాపురం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి, రైల్వే ఎస్సై బి.లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు.

రత్నగిరిపై ఘనంగా విజయదశమి వేడుకలు

- రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు
- శాస్త్రోక్తంగా చండీహోమం, పూర్ణాహుతి
- ఘనంగా శమీపూజ

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో విజయదశమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చి భక్తుల నుంచి పూజలు అందుకున్నారు. దర్బారు మండపంలో ఉదయం 11 గంటలకు చండీహోమం పూర్ణాహుతి, రాత్రి దేవస్థానం హైస్కూల్ వద్ద ఉన్న శమీవృక్షం వద్ద శమీపూజ నిర్వహించారు.

రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చిన దుర్గామాతలు

విజయదశమి పర్వదినం సోమవారం సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు శాంతమూర్తి అయిన రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నీలం, ఊదా రంగు చీర ధరించి శంఖుచక్రాలు, పాశం ధరించి, పాడిపంటలు వృద్ధి చేసేందుకుగాను మరో చేతిలో చెరుకుగడతో అమ్మవార్లు భక్తుల పూజలందుకున్నారు.



దేవస్థానం హైస్కూల్‌లో శమీపూజ నిర్వహిస్తున్న పండితులు

చండీహోమం పూర్ణాహుతి

రత్నగిరి దర్బారు మండపంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు చండీహోమం, అనంతరం పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఏసీ రామ్మోహన్‌రావు, ఏఈఓ కొండలరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించారు.

గజవాహనంపై ఊరేగింపు

ఉదయం ఆరు గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లను వెండి గజ వాహనం, పల్లకీ మీద క్షేత్రపాలకులు సీతారాములను ఊరేగింపుగా దేవస్థానం హైస్కూల్ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ సత్యదేవుడు, అమ్మవార్లను వెండి సింహాసనం మీద, క్షేత్రపాలకులు సీతారాములను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మరో వేదిక మీద ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. తరువాత శమీపూజ నిర్వహించారు. శమీపూజ మంత్రాన్ని చదువుతూ స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో శమీ వృక్షానికి మూడు సార్లు ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే స్థానిక జూనియర్ కళాశాలలో రావణ దహనంతో దసరా ఉత్సవాలు ముగిశాయి.



రత్నగిరిపై రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గ అమ్మవారు

పీడీఎస్ బియ్యం పట్టివేత

కాకినాడ క్రైం: పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వాహనాన్ని గుర్తించి అధికారులు సీజ్ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎం.స్నేహిత తెలిపిన వివరాల మేరకు, కాకినాడ కల్పన సెంటర్‌లో ఓ ట్రక్కుని తనిఖీ చేయగా, 51 బస్తాలతో కూడిన 2600 కిలోల రూ.9,55,650 విలువైన రేషన్ బియ్యం బయటపడ్డాయి. వీటిని తరలిస్తున్న డ్రైవర్‌ను కొయ్య గోవింద్‌ను విచారించగా, గోపి అనే వ్యక్తి ఆదేశాల మేరకు నగరంలోనే మరో ప్రాంతానికి ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిపాడు. వాహన యజమాని మాడుగుల అయ్యప్ప అని అధికారులకు చెప్పాడు. దీంతో అయ్యప్ప, గోపి సహా గోవింద్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

కాట్రేనికోన: మండలంలోని పల్లం పంచాయతీ గోపాలరావు పేట సమీపాన మద్యం తాగి బైక్‌పై వెళుతున్న వ్యక్తులు వృద్ధుడు అయితాబత్తుల స్వామి(60)ని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం పల్లం గ్రామానికి చెందిన మద్యం తాగిన వ్యక్తులు బైక్‌పై వెళుతూ స్వామిని ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై స్వామి కుటుంబ సభ్యులు కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బ్యాగ్ మారింది.. పోలీసుల చొరవతో దొరికింది

తుని: దసరా పండగ సమయంలో బస్సులో ప్రయాణికుడికి చెందిన బ్యాగ్ పొరబాటున వేరే ప్రయాణికుడు పట్టుకుని వెళ్లిపోయాడు. ఇంతలో బ్యాగ్ కనిపించక పోవడంతో ఆందోళన చెందిన వ్యక్తి తుని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు పర్యవేక్షణలో తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ సిబ్బందితో కలసి దర్యాప్తు చేశారు. శనివారం సీఐ గీతారామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం. విశాఖపట్నం అగనంపూడికి చెందిన డోలా వినోద్‌కుమార్ ఈ నెల 12న ఆర్టీసీ బస్సులో కాకినాడ వెళుతున్నాడు. ఇతని బ్యాగులో బట్టలు, రూ.45 వేల నగదు, 8 కాసుల బంగారు వస్తువులు ఉన్నాయి. బస్సు అన్నవరం బస్‌స్టేషన్‌కు వెళ్లే సరికి బ్యాగు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తుని ఆర్టీసీ బస్టాండులో సీసీ ఫుటేజీను కానిస్టేబుళ్లు శ్రీనివాస్, డి.చిన్న అప్పారావు, సీహెచ్.అప్పలనాయుడు పరిశీలించారు. బ్యాగు మారిపోయి ఉండవచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తుండగా విశాఖపట్నం గాజువాకకు చెందిన మండల అశోక్, అతని భార్య సాయిలక్ష్మిలు టీడీపీ నాయకుడు సుర్ల లోవరాజుకు ఫోన్ చేసి బ్యాగ్ పొరబాటున మారినట్టు తెలియపరిచారు. దీంతో లోవరాజు తుని పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఇరు పార్టీలను పిలిపించి ఎవరి బ్యాగ్ వారికి అప్పగించారు. విలువైన బంగారు వస్తువులు ఉన్నా నిజాయితీ తిరిగి అప్పగించిన అశోక్, సాయిలక్ష్మి దంపతులను సీఐ గీతా రామకృష్ణ అభినందించారు. ప్రజలు బస్సులు, రైళ్లలో ప్రయాణించే సమయంలో విలువైన వస్తువులను బ్యాగుల్లో పెట్టుకుని అజాగ్రత్తగా ఉండవద్దని కోరారు.



బస్సులో మారిన బ్యాగ్, బంగారు వస్తువులను బాధితులకు అందజేస్తున్న సీఐ గీతా రామకృష్ణ

రాష్ట్ర స్థాయి కబడ్డీలో ఉమ్మడి జిల్లా జట్టు విజయకేతనం

సామర్లకోట: దసరా ఉత్సవాలను పురస్కరించుకొని పూర్వ 13 ఉమ్మడి జిల్లాలకు మంగళగిరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ మేరకు వివరాలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీను ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఫైనల్ మ్యాచ్ శనివారం రాత్రి కృష్ణా–తూర్పు గోదావరి జిల్లాల మధ్య హోరాహోరి పోరు సాగిందని చెప్పారు. చివరి నిమిషంలో మూడు పాయింట్ల ఆధిక్యంతో తూర్పు గోదావరి జిల్లా జట్టు విజయ కేతనం ఎగురవేసి ప్రథమ బహుమతిగా ట్రోఫీ, రూ.లక్ష నగదు గెలుచుకుంది. సామర్లకోటకు చెందిన అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు కె.శ్రీనివాసు ఈ విజయానికి కీలక భూమిక పోషించారు. అంతర్జాయతీ పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు సాధించిన శ్రీనివాసును ప్రభుత్వం గుర్తించి 15 ఏళ్ల క్రితం బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగం ఇచ్చింది. అప్పటి నుంచి రాష్ట్ర స్థాయిలో జరిగే ప్రతి కబడ్డీ పోటీలోనూ ఆయన పాల్గొంటున్నారు. జిల్లా కబడ్డీ జట్టు సభ్యులకు రాష్ట్ర మాజీ కోచ్ పోతుల సాయి, ప్రో కబడ్డీ అంపైర్ బోగిళ్ల మురళీకుమార్ శిక్షణ ఇచ్చారు. ప్రథమ స్థానం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టును రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, కార్యదర్శి కొండపల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు కిరణ్, కోశాధికారి తాళ్లూరి వైకుంఠం, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.



ప్రథమ బహుమతిగా ట్రోఫీ, రూ.లక్ష చెక్కు అందుకున్న జిల్లా జట్టు

క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవాలి

రామచంద్రపురం: గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ అన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో శనివారం ముగిసిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర, బాలికల జట్లు ప్రథమస్థానంలో నిలిచాయి. లీగ్ కం నాకవుట్ పద్ధతిలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 13 బాలుర జట్లు, 9 బాలికల జట్లు తలపడ్డాయి. బాలుర విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జట్లు ప్రథమ స్థానంలో నిలవగా అనంతపురం ద్వితీయ, విశాఖ, గుంటూరు జట్లు తృతీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రథమ స్థానం, కృష్ణా జిల్లా ద్వితీయ, చిత్తూరు, గుంటూరు జిల్లాలు తృతీయ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన విజేతలకు ఎంపీ హరీష్ మాథుర్ షీల్డ్, బహుమతులను అందజేశారు. ఏపీ ఇన్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంగల్రాయుడు, ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



బాలుర విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి బాలుర జట్టు

కాలు జారిపడి వ్యక్తి మృతి



సత్తి వీరరాఘవ రెడ్డి (ఫైల్)

పెదపూడి: గోడ ఎక్కి టెంట్ తాడు కట్టే సమయంలో ప్రమాదవశాత్తూ కాలుజారి పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తి మండలం పాలమూరులో ఆదివారం దుర్గాదేవి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అన్నసమారాధనకు టెంట్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అదే గ్రామానికి చెందిన సత్తి వీర రాఘవరెడ్డి (33) షామియానా నిర్వహిస్తున్నాడు. వీరరాఘవరెడ్డి ఆలయం వద్ద టెంట్ ఏర్పాటు చేయాల్సి ఉన్న నేపథ్యంలో గోడ ఎక్కి టెంట్ తాడు కడుతుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి సిమ్మెంట్ రోడ్డుపై పడ్డాడు. దీంతో రాఘవరెడ్డి తలకు బలమైన గాయం తగిలి రక్తస్రావమైంది. వెంటనే అనపర్తిలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి సత్తి గంగిరెడ్డి ఫిర్యాదుపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెయింట్ వేస్తూ..



కొమ్మన నాని

సామర్లకోట: మండలంలోని పవర శివారులో ఓ భవనానికి రంగులు వేస్తుండగా పిఠాపురం మండలం రథాల పేటకు చెందిన ఇద్దరు యువకులు ఈనెల ఐదున జారి పడిపోయారు. విశాఖపట్నానికి చెందిన భవన యజమాని క్షతగాత్రులను పవరలో ఉన్న కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొమ్మన నాని (25) ఆదివారం మృతి చెందాడు. కందికట్ల మోహన్‌కుమార్ చికిత్స పొందుతున్నాడు. నాని మృతి చెందడంతో అతడి కుటుంబ సభ్యులు భవనం వద్దకు మృతదేహంతో చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా చేశారు. విషయం తెలుసుకొని సీఐ ఎ.కృష్ణభగవాన్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

బైక్ నుంచి జారిపడి..

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డు మహిళ బైక్ నుంచి జారి పడి ఆదివారం మృతి చెందిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం కాకినాడ జార్జిపేట నుంచి పెద్దాపురానికి భార్యాభర్తలు బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో మాధవపట్నం–వీకే రాయపురం గ్రామాల మధ్యలో రోడ్డుపై ఉన్న గోతుల్లో బైక్ పడటంతో వెనుక కూర్చున్న దొంతన ఆదిలక్ష్మి (60) జారి రోడ్డుపై పడింది. తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కీర్తిలాల్స్ నూతన షోరూం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: చక్కటి వజ్రాభరణాలలో విశిష్టమైన పేరు పొందిన కీర్తిలాల్స్ 14వ రిటైల్ షోరూంను విజయదశమి సందర్భంగా రాజమహేంద్రవరం ఏవీ అప్పారావు రోడ్‌లో ప్రారంభించారు. దీనిని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని చేతుల మీదుగా ప్రారంభించారు. కొత్త కీర్తిలాల్స్ షోరూమ్ ప్రత్యేక లక్షణం ఇంటిగ్రేటెడ్ బ్రైడల్ స్టూడియో, బ్రైడల్ జ్యువెలరీ షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరచడానికి రూపొందించినట్లు కీర్తిలాల్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ తెలిపారు. ఈ స్టూడియోలో అన్ని రకాల ఆభరణాలు లభిస్తాయన్నారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని, కీర్తిలాల్స్ పరిమిత సమయ మొదటి ప్రమోషన్‌ను అందిస్తోందన్నారు. విలువ ఆధారిత సేవలపై 50 శాతం తగ్గింపుతో పాటు డైమండ్ ఆభరణాలపై క్యారెట్‌కు రూ.12 వేల వరకు తగ్గింపు అందిస్తున్నామన్నారు.



షోరూం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని

డీజే శబ్దాలకు గుండె ఆగి యువకుడి మృతి



డీజేల పెను శబ్దాలకు గుండె ఆగి ప్రాణాలు విడిచిన వినయ్ (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురం దసరా ఊరేగింపుల సంబరాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. ఊరేగింపులో డీజేల పెను శబ్దాలకు 22 ఏళ్ల యువకుడి గుండె ఆగి ప్రాణాలు వదిలాడు. అమలాపురం రూరల్ మండలం బండార్లంక గ్రామానికి చెందిన పప్పుల వినయ్ ఈ ఘటనలో మృతి చెందాడు. హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న వినయ్ ఏటా అమలాపురం దసరా ఊరేగింపులకు విధిగా రావడం అలవాటు. హైదరాబాద్ నుంచి శుక్రవారమే స్వగ్రామానికి వచ్చిన వినయ్ శనివారం జరిగిన దసరా సంబరాల్లో డీజే బాక్సుల విపరీత శబ్దాల ధాటికి బలయ్యాడు. కొంకాపల్లి వీధి దసరా ఉత్సవాల్లో డీజే నుంచి వస్తున్న పాటలకు అనుగుణంగా స్టెప్పులు వేస్తున్న సమయంలో వినయ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతడిని బందోబస్తులో ఉన్న పోలీసులు తక్షణమే అత్యవసర వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వినయ్ ప్రాణాలు విడిచాడు. వినయ్ మృతితో అతని స్వగ్రామం బండార్లంకలో విషాదం అలుముకుంది. వినయ్ తండ్రి ఓ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. తల్లి ఆర్టీసీ కండక్టర్. ఇద్దరు అన్నదమ్ముల్లో వినయ్ చిన్నవాడు. చేతి కందివచ్చిన కుమారుడి ఆకస్మికంగా మృతి చెందడంతో అతడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

గోదావరిలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

రావులపాలెం: కుటుంబ గొడవల నేపథ్యంలో ఒక మహిళ రావులపాలెం గౌతమి గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. దీంతో అటుగా వెళ్తున్న జొన్నాడకు చెందిన యువకుడు వెంకటరెడ్డి స్థానిక జాలర్లతో కలసి ఆ మహిళను కాపాడాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం నడిపూడికి చెందిన వెన్నేటి రాజేశ్వరి(35) కుటుంబ గొడవల నేపథ్యంలో బస్సు ఎక్కి రావులపాలెం చేరుకుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గంగా స్థానిక గౌతమి పాత బ్రిడ్జి పైకి చేరింది. గోదావరిలోకి దూకేందుకు చెప్పులు విడిచి రెయిలింగ్ ఎక్కుతుండగా అటుగా వెళుతున్న జొన్నాడకు చెందిన వెంకటరెడ్డి ఆమెను గమనించి ఆపేందుకు ప్రయత్నించాడు. అయితే ఒక్కసారిగా ఆమె నదిలోకి దూకేయడంతో అక్కడే ఉన్న స్థానిక మత్స్యకార యువకులతో కలసి నావపై వెళ్లి ఆ మహిళను ఒడ్డుకు చేర్చారు. దీంతో సమాచారం అందుకున్న రావులపాలెం హెచ్‌సీ ఎస్.సత్యనారాయణ సంఘటన ప్రాంతానికి చేరుకుని, వెంటనే ఆ మహిళను స్థానికుల సాయంతో బైక్‌పై ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమె సమాచారాన్ని సేకరించి భర్త శ్రీనివాస్‌ను పిలిపించారు. రాజేశ్వరి వస్తువులు, సెల్‌ఫోన్ అప్పగించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీనిపై వివరాలు నమోదు చేసుకున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి

కడియం: మండలంలోని వేమగిరిలో జాతీయ రహదారిపై గత నెల 29న బొలెరో వాహనం గుర్తుతెలియని మహిళను ఢీకొట్టింది. దీంతో ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని కడియం పోలీసులు తెలిపారు. ఆమె వివరాలు ఎవరికైనా తెలిస్తే కడియం పోలీసులను సంప్రదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మృతదేహం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు.

భవానీ భక్తుల బస్సుకి ప్రమాదం: మహిళ మృతి

కొవ్వూరు: విశాఖ జిల్లాపరవాడ నుంచి విజయవాడ దుర్గగుడికి వెళుతున్న భవానీ భక్తుల బస్సు కొవ్వూరులో శనివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురైంది. కొవ్వూరు సమీపాన నేషనల్ హైవే సర్వీసు రోడ్డు సమీపాన టైర్లలో గాలి చెక్ చేయడానికి బస్సు ఆపారు. రాజాం నుంచి చిత్తూరు పురికోస లోడుతో వెళుతున్న ఐషర్ వ్యాన్ వెనుక నుంచి బస్సుని ఢీకొట్టింది. ఒక లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఐషర్ వ్యాన్ అదుపుతప్పి ముందు ఉన్న బస్సు వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో వెనుక భాగంగా మూడు లైన్ల సీట్లు నుజ్జునుజ్జయ్యాయి. వెనుక సీటులో కూర్చున్న భవానీ భక్తురాలు పోలవరపు అప్పలనరసమ్మ (55) మృతి చెందింది. మరో ఏడుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. పట్టణ సీఐ పి.విశ్వం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రోడ్డు సేఫ్టీ పోలీసులు, క్షతగాత్రుల బంధువుల సాయంతో గాయపడిన వారిని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టాటా ఏస్ బోల్తా: 20 మందికి గాయాలు

పట్టణంలో టోల్ ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో రెండు టాటా ఏస్ వాహనాలు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో ఇరవై మందికి స్వల్ప గాయాలు కాగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం దుగ్గాడ గ్రామానికి చెందిన భవానీ భక్తులు విజయవాడ దుర్గగుడి రెండు టాటా ఏస్ వాహనాల్లో బయల్దేరారు. మార్గంమధ్యలో ఒక వాహనం మరమ్మతులకు గురి కావడంతో దాన్ని ముందు వాహనానికి తాడు కట్టారు. గామన్ బ్రిడ్జి దాటుతుండగా వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టింది. దీంతో రెండు టాటా ఏస్ వాహనాలు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు ఇరవై మందికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాల పాలైన వారిని మెరుగైన చికిత్స నిమిత్తం బంధువులు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం భవానీ భక్తులు విజయవాడ పయనమయ్యారు. ఈ ఘటనపై ఏ విధమైన ఫిర్యాదు ఇవ్వలేదని సీఐ తెలిపారు.



కొవ్వూరులో రోడ్డు ప్రమాదానికి గురై దెబ్బతిన్న బస్సు

రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి..

ముమ్మిడివరం: అన్నంపల్లి లక్ష్మీదేవిలంక వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. యానాంకు చెందిన అద్దంకి అప్పారావు(50) అన్నంపల్లి లక్ష్మీదేవి లంక వద్ద బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అప్పారావును అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అప్పారావుకు భార్య నాగవల్లి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ జిల్లా చోరీ ముఠా అరెస్ట్

- నలుగురు మహిళలు, ఒక పురుషుడు రిమాండ్‌కు తరలింపు
- కారు, 100 గ్రాముల ఆభరణాల స్వాధీనం

గండేపల్లి: ప్రయాణికుల మాదిరిగానే తోటి ప్రయాణికులతో కలసిపోయి ఎవరికీ అనుమానం రాకుండా వారితో ప్రయాణిస్తూనే వారి నగదును చోరీ చేస్తున్న అంతర్ జిల్లా ముఠాను అరెస్ట్ చేసినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. గండేపల్లి పోలీస్ స్టేషన్లో శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాలిలా.. ఏలేశ్వరం తన అక్క ఇంటికి వచ్చిన విశాఖకు చెందిన మొల్లేటి సుగుణ తన ఇద్దరు పిల్లలతో కలసి ఈనెల 7న ఏలేశ్వరం నుంచి యర్రవరం వచ్చింది. అక్కడి నుంచి మండలంలోని మురారిలో తన పుట్టింటికి వచ్చి సాయంత్రం 4.30 నిమిషాలకు తనతో పాటు తెచ్చుకున్న లగేజ్ బ్యాగ్‌ను చెక్ చేసుకోగా బ్యాగ్‌లో పెట్టిన బంగారు ఆభరణాల బాక్స్ కనిపించకపోవడంతో స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విదితమే. దర్యాప్తు చేపట్టిన పోలీసులు చోరీకి పాల్పడిన నలుగురు మహిళలను, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. చోరీకి పాల్పడిన నలుగురు మహిళలు అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన రావుల దుర్గ, అదే జిల్లా గొట్లం కె.కోటపాడుకు చెందిన రావుల వసంత, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన గంటా రేవతి, కాకినాడ జిల్లా గోకవరానికి చెందిన నాగులూరి శివపార్వతిగా గుర్తించారు. పట్టుబడిన వ్యక్తి అనకాపల్లి జిల్లా మాడుగులకి చెందిన మేరకనపల్లి వెంకటేశ్వరరావుగా గుర్తించారు. వీరంతా విజయవాడ నుంచి వస్తుండగా పట్టుకుని అరెస్టు చేసి పెద్దాపురం కోర్టుకు తరలించగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు. కాగా వీరంతా దగ్గరి బంధువులే కావడం మరో విశేషం. కేసును త్వరితగతిన ఛేదించడంలో కృషి చేసినందుకుగాను ఉన్నతాధికారులు సీఐ, ఎస్సై యువీ శివ నాగబాబు, సిబ్బందిని అభినందించినట్టు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు